ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్

జిల్లాల వార్తలు

శనివారం 16 నవంబరు 2024



ఝరాసంగంలో శివపార్వతుల కళ్యాణం



ఏడుపాయలలో మంజీర నదికి హారతి ఇస్తున్న అర్చకులు







మెదక్ కోదండరామాలయంలో..



పెద్దాపూర్ మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలో..

దేదీప్యమానం

పెద్దాపూర్ మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలో లక్షదీపోత్సవంలో వెలిగించిన దీపాలు

కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచి శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో విశేష అభిషేకాలను నిర్వహించారు. మహిళలు, యువతులు దీపాలను వెలిగించారు. పలుచోట్ల చెరువుల్లో దీపాలను విడిచారు. ఇళ్లల్లో తులసీమాత పూజలను చేశారు. సదాశివపేట మండలం పెద్దాపూర్ మల్లికార్జునస్వామి ఆలయంలో సాయంత్రం లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. దీపకాంతులతో గుడి ఆవరణ దేదీప్యమానంగా వెలుగొందింది. ఏడుపాయల వనదుర్గామాత ఆలయ ఆవరణలో రాత్రి దీపోత్సవాన్ని నిర్వహించి మంజీర నది వద్ద గంగాహారతినిచ్చారు. ఝరాసంగం మండలంలోని కేతకీ సంగమేశ్వరాలయంలో కల్యాణం నిర్వహించారు.

-న్యూస్ నెట్‌వర్క్

లగచర్ల రైతులకు

కేటీఆర్ పరామర్శ

సంగారెడ్డి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్నవారితో ములాఖత్

తరలివచ్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

మీడియా సమావేశంలో ప్రభుత్వంపై విమర్శలు



లగచర్ల బాధితులను కలవడానికి కందిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలులోకి వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కంది, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : లగచర్ల ఘటనలో అరెస్టయిన వారితో ములాఖత్ కోసం బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం కందిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలుకు వచ్చారు. కేటీఆర్ కందికి వస్తున్న నేపథ్యంలో సంగారెడ్డి సెంట్రల్ జైలు దారిలో ఇతర వాహనాలు వెళ్లకుండా పోలీసులు బందోబస్తుతో పాటు బారికేడ్లను ఏర్పాటు చేశారు. కేటీఆర్‌ను కలుసుకునేందుకు ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి బీఆర్ఎస్ శ్రేణులు వందలాది వాహనాల్లో కందికి తరలివచ్చారు. దీంతో కంది-శంకర్‌పల్లి హైవేలో దాదాపు 2 గంటల వరకు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరిన కేటీఆర్ తొలుత పటాన్‌చెరులో ఆగి అక్కడి నాయకులను కలుసుకున్నారు. పటాన్‌చెరులో తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం కందికి వచ్చిన కేటీఆర్‌కు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ స్వాగతం పలికారు. మధ్యాహ్నం 12 గంటలకు కేటీఆర్ నాయకులతో కలిసి సంగారెడ్డి సెంట్రల్ జైలులోకి వెళ్లారు. జైలులో ములాఖత్ ద్వారా లగిచర్ల బాధితులను కలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. అనంతరం ఒంటిగంటకు జైలు బయటకువచ్చి మీడియాతో సమావేశమయ్యారు. మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి మాట్లాడారు.



బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడుతున్న కేటీఆర్



పట్టుబట్టి.. కొలువుపట్టి..

గ్రూప్ -4 ఫలితాల్లో ఉమ్మడి జిల్లావాసుల సత్తా

పలుశాఖల్లో జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగాలు

పేద, మధ్యతరగతి కుటుంబాల్లో విద్యాకుసుమాలు

ఇతర ఉద్యోగాలు చేస్తూనే సన్నద్ధం

గ్రూప్ 2, గ్రూప్ 1, సివిల్స్ కూడా సాధిస్తామంటున్న విజేతలు

7 లో

'శ్రమ నీ ఆయుధమైతే విజయం నీ బానిస అవుతుంది'.. అనే స్ఫూర్తితో అహర్నిశలు కష్టపడి ఫలితం దక్కించుకున్నారు. చదివిన చదువుకు సార్థకత పొందాలని పోటీ పరీక్షలకు సిద్ధమైన ప్రతిభావంతులను ప్రభుత్వ ఉద్యోగాలు వరించాయి. తల్లిదండ్రుల కలలను సాకారం చేస్తూ.. తమ లక్ష్యాలను సాధించారు. ప్రభుత్వం గురువారం విడుదల చేసిన గ్రూప్-4 ఫలితాల్లో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన యువతీయువకులు ఉద్యోగాలు దక్కించుకున్నారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో ఉన్నతోద్యోగాలను సాధిస్తామని పిడికిలి బిగిస్తున్నారు. తమ ప్రణాళికలు, అనుభవాలను వారు 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, నవంబరు 15

సంగీత ప్రభాకరుడు

మ్యూజిక్‌లో రాణిస్తున్న రాపర్తి యువకుడు

గాయకుడు, పాటల రచయిత, సంగీత దర్శకుడిగా బహుముఖ ప్రతిభ

ఎస్ఎం స్వరాలీ మ్యూజిక్ అకాడమీ స్థాపన

7

మహిమాన్వితం అష్టాదశ శక్తిపీఠం

రూ.6 కోట్లతో నిర్మాణం

ప్రథమ వార్షికోత్సవాలు షురూ



7

అష్టాదశ శక్తిపీఠ ఆలయం

అండర్ డ్రైనేజీ అస్తవ్యస్తం

జహీరాబాద్ పట్టణంలో అధ్వానంగా పారిశుధ్యం

రోడ్లపైనే మురుగు పరుగు

8

మెదక్ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలకు

న్యాక్ ఏ-గ్రేడ్ గుర్తింపు

● రాష్ట్రంలోనే తొలి గిరిజన కళాశాల

మెదక్ అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కమిటీ (న్యాక్) ఏ గ్రేడ్ దక్కించుకుంది. ఇప్పటివరకు న్యాక్ బృందం తెలంగాణ రాష్ట్రంలో 12 కళాశాలలను సందర్శించినప్పటికీ ఎక్కడా ఏ-గ్రేడ్ హోదా దక్కలేదు. ఒక్క మెదక్ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల కళాశాల ఏ గ్రేడ్‌తో ముందు వరుసలో నిలిచి రాష్ట్రంలోనే ఏ-గ్రేడ్ సాధించిన తొలి గిరిజన కళాశాలగా రికార్డు సాధించింది. న్యాక్ బృందం ఈ నెల 5, 6 తేదీల్లో పట్టణంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించింది. జాతీయ స్థాయిలోని ప్రొఫెసర్ల ఆధ్వర్యంలో కళాశాల పనితీరు పరిశీలించింది. ఈ సందర్భంగా విద్యార్థినులతోపాటు వారి తల్లిదండ్రులతోనూ బృందం సభ్యులు సమావేశమయ్యారు. ప్రభుత్వం మహిళ విద్యకు అందిస్తున్న సహకారంపై కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉమాదేవి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కళాశాలలో బోధన జరుగుతున్న ల్యాబ్‌ల పనితీరుపై బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఫలితంగా ఉన్నతస్థాయి గుర్తింపు దక్కింది. కళాశాలకు ఏ-గ్రేడ్ హోదా రావడంతో విద్యార్థినులు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు.

అందరి సహకారంతోనే..

కళాశాలకు న్యాక్ ఏ-గ్రేడ్ రావడం సంతోషకరం. గ్రేడ్ సాధించడానికి కీలకంగా వ్యవహరించిన ఆధ్యాపక బృందాన్ని అభినందనలు. అందరి సహకారంతోనే ఈ ఘనత సాధించాం. కళాశాలలో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పడానికి, యూజీసీ నిధులు సాధించడానికి మార్గం సులభమైంది. ఇది విద్యార్థినుల భవిష్యత్తుకు ఎంతోగానో ఉపయోగపడుతుంది.

-ఉమాదేవి, ప్రిన్సిపాల్



టపాసులు కాలుస్తూ సంబరాలు చేసుకుంటున్న విద్యార్థినులు

గ్రూప్-3కి పకడ్బందీ ఏర్పాట్లు

● సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి



సంగారెడ్డి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. రెండు రోజుల పాటు నిర్వహించే గ్రూప్ - 3 పరీక్షలకు 15,163 అభ్యర్థులు హాజరుకానున్నారని, జిల్లా వ్యాప్తంగా 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని వెల్లడించారు. కేంద్రాల వద్ద మెడికల్ ఎమర్జెన్సీ వస్తే స్పందించడానికి ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఏఎన్ఎం, మందులను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఆదివాసుల ఆరాధ్యదైవం భగవాన్ బిర్సా

● కేంద్ర ప్రభుత్వ 'ఉత్కర్ష్ అభియాన్' పథకానికి 9 మండలాల ఎంపిక ● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ అర్బన్/సంగారెడ్డి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమం, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన మహనీయుడు, ఆదివాసుల ఆరాధ్యదైవం భగవాన్ బిర్సా ముండా అని మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావు కొనియాడారు. భగవాన్ బిర్సా 150వ జయంతిని పురస్కరించుకుని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ రాహుల్‌రాజ్ అధ్యక్షతన నిర్వహించిన జన్‌జాతీయ గౌరవ్ దివాస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం ధరి ఆబా జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం ద్వారా రూ.78,600 కోట్ల నిధులు కేటాయించిందన్నారు. పథకం కింద జిల్లాలోని రామాయంపేట, హవేళీఘణపూర్, పాపన్నపేట, నర్సాపూర్, కౌడిపల్లి, మాసాయిపేట, చిన్నశంకరంపేట, టేక్మాల్, రేగోడ్ మండలాలు ఎంపికైనట్లు ఎంపీ తెలిపారు. అలాగే, సంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మెదక్‌లో బిర్సా ముండా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ, కలెక్టర్

ప్రాణం పోతే తప్ప పట్టించుకోలే..

● ప్రమాదకర తీగలపై ఫిర్యాదుపై విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం ● ప్రాణం పోయాక తొలగింపు

మనోహరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఒక నిండు ప్రాణం పోయింది. తీగలతో ప్రమాదం పొంచి ఉందని.. వాటిని తొలగించాలని ఏళ్లుగా గ్రామస్తులు ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఫలితం లేకుండా పోయింది. విద్యుత్ తీగల వల్ల గురువారం ఒకరు చనిపోయారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన జితేందర్ ప్రజాపతి(23) మనోహరాబాద్ మండలంలోని కూచారం గ్రామానికి చెందిన గోవర్ధన్‌రెడ్డి వద్ద ఎక్స్‌కవేటర్ నడుపుతూ నాలుగు నెలల నుంచి అదే గ్రామంలో నివాసం ఉంటున్నాడు. గురువారం స్నేహితులతో కలసి లారీపై ఎక్స్‌కవేటర్‌ను తీసుకొని సికింద్లాపూర్ నుంచి పోతారం మీదుగా శివ్వంపేట్ బయలుదేరాడు. పోతారంలో తక్కువ ఎత్తులో వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో గమనించిన డ్రైవర్ కార్తీక్, ఆపరేటర్ ముఖేష్‌కుమార్ లారీని నిలిపారు. వారి వెనకే దిగిన జితేందర్ లారీని పట్టుకోవడంతో విద్యుదాఘతానికి గురై మృతిచెందాడు. ఈ ప్రమాదం జరిగితే కానీ విద్యుత్ అధికారులు మేల్కోలేదు. శుక్రవారం విద్యుత్‌శాఖ సిబ్బంది హుటాహుటిన గ్రామానికి చేరుకుని వేలాడుతున్న కరెంటు వైర్లను బాగుచేశారు. అయితే, గ్రామంలో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని ఏడేళ్లుగా పలుమార్లు ఫిర్యాదు చేసినా, పంచాయతీలో తీర్మానం చేసినా స్పందించలేదని పోతారం తాజా మాజీ సర్పంచ్ మాధవరెడ్డి ఆరోపించారు. ప్రాణం పోతే తప్ప విద్యుత్ అధికారులు పట్టించుకోరా అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



పోతారంలో వైర్లను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది



కమ్ముకున్న విషవాయువులు

ఈ చిత్రాన్ని చూసి మంచు పడుతుందనుకుంటే పొరపొడినట్లే.. ఇది గడ్డపోతారం పారిశ్రామికవాడలోని పలు రసాయన పరిశ్రమల నుంచి వెలువడిన ఘాటైన రసాయన వాయువులు. శుక్రవారం పెద్దఎత్తున కాలుష్య వాయువులు వ్యాపించడంతో దుర్వాసన నెలకొన్నదని స్థానికులు తెలిపారు. గాలి కాలుష్యంతో శ్వాస తీసుకోలేని పరిస్థితి నెలకొందని, అధికారులు స్పందించాలని కోరారు.

- జిన్నారం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి)

తలస్నానాలు చేసి.. రామయ్యను కొలిచి

భక్తులతో కిటకిటలాడిన రామునిబండ



రామునిబండ కోదండ రామస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

జగదేవ్‌పూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని శ్రీకోదండ సీతారాముల ఆలయంలో శుక్రవారం కార్తీకపౌర్ణమి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేలాది మంది భక్తులతో రామునిబండ ఆలయం కిటకిటలాడింది. తండోపతండాలుగా భక్తులు తరలివచ్చి శ్రీసీతారాముల స్వామివారిని దర్శించుకున్నారు. ప్రతి ఏటా కార్తీక పౌర్ణమి రోజు నుంచి రెండు రోజుల పాటు ఘనంగా స్వామివారి జాతర ఉత్సవాలు జరుగుతాయి. ఉదయం ఆలయ నిర్వాహకులు వేణుగోపాలాచారి, రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కుమార్ ఆధ్వర్యంలో జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

తలస్నానాల కోసం పోటీ

ఆలయం వద్ద భక్తులు తల స్నానాల కోసం పోటీపడ్డారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు గురువారం రాత్రి ఆలయానికి చేరుకుని అక్కడే నిద్ర చేశారు. శుక్రవారం తెల్లవారుజామున సూర్యోదయానికి ముందు భక్తులు ఉసిరాకు, కాయలతో ఆలయం ముందున్న గుండంలో తల స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 10 గంటల వరకు భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. గుండంలో నీళ్ల కోసం భక్తులు పోటీపడుతూ బకెట్ల సహాయంతో స్నానాలు చేశారు. మహిళలు దీపారాధన చేశారు. ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా జగదేవ్‌పూర్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ఆలయంలోని నీటి గుండంలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

భక్తులకు తప్పని కష్టాలు

రామునిబండ రామాలయంలో భక్తులకు ప్రతి యేటా కష్టాలు తప్పడం లేదు. ఉదయం 10 గంటల తర్వాత ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో ప్రధాన విగ్రహం గుండా ఆలయంలో లోపలికి రావడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వందల సంఖ్యలో ఉన్న భక్తులు ఒకరినొకరు తోసుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. గుండం వద్ద స్నానాలు చేయడానికి ఇబ్బందులు పడ్డారు. దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్‌లలో వేచి ఉండాల్సి వచ్చిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు దాటుతుండగా..
కారు ఢీకొని ఒకరి మృతి



మృతిచెందిన సంజీవ్‌చారి

మనోహరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డును దాటుతుండగా కారు ఢీకొని ఒకరు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మండల పరిధిలో కాళ్లకల్ 44వ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్లా జిల్లా ముస్తాబాద్‌కు చెందిన సంజీవ్‌చారి(52) కాళ్లకల్ గ్రామంలో అద్దెకు ఉంటూ కొన్నాళ్లుగా గ్లోస్టర్ కేబుల్ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి 8 గంటలకు విధులు ముగించుకుని ఇంటికి బయలుదేరాడు. కాళ్లకల్ జాతీయ రహదారి వద్ద రోడ్డు దాటుతుండగా కొంపల్లికి వెళుతున్న కారు సంజీవచారిని ఢీకొన్నది. కారులో ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. వారికి స్వల్ప గాయాలు కావడంతో హైదాబాద్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సబ్‌స్టేషన్ ఆపరేటర్‌పై దాడి



గాయపడ్డ శ్రీనివాస్

చేగుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సబ్‌స్టేషన్ ఆపరేటర్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన చేగుంట మండలం చిన్నశివనూర్ గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకున్నది. అక్టోబరు 17న సబ్‌స్టేషన్ ఆపరేటర్‌ల సమావేశానికి చిన్నశివనూర్ గ్రామానికి చెందిన డీసీఎం డ్రైవర్ బొండ్ల సురేష్ డీసీఎంను అద్దెకు మాట్లాడి కొంత డబ్బు చెల్లించారు. ఆరోజు డీసీఎం వద్దని అడ్వాన్స్ వెనక్కు ఇవ్వాలని సబ్‌స్టేషన్ సిబ్బంది తెలిపారు. దీంతో సురేష్ వారిపై కోపాన్ని పెంచుకున్నాడు. శుక్రవారం కర్నాల్‌పల్లి 11కేవీ సబ్‌స్టేషన్‌కు వెళ్లి పవర్ ట్రాన్స్‌ఫార్మర్(పీటీఆర్)ను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. సబ్‌స్టేషన్ ఆపరేటర్ శ్రీనివాస్ అడ్డుకోగా ఇద్దరి మధ్య గొడవకు దారి తీసింది. శ్రీనివాస్‌ను సురేష్ ఇనుపరాడ్‌తో కొట్టాడు. శ్రీనివాస్ తలకు గాయమై రక్తం వెలువడింది. అతడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

క్రైం కార్నర్

మత్స్యకార్మికుడి ఆత్మహత్య


మల్లయ్య(ఫైల్)

రామాయంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ; మత్స్య కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన రామాయంపేట మండల పరిధి లక్ష్మాపూర్‌లో శుక్రవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయ&ఇ. గ్రామానికి చెందిన ముద్రబోయిన మల్లయ్య(48) గతేడాది గ్రామ చెరువును చేపలు పట్టేందుకు లీజుకు తీసుకున్నాడు. ఇందులో నష్టాలు రావడంతో అప్పు తీర్చే మార్గం లేక జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి చెట్టుకు ఉరివేసుకున్నాడు. భార్య శ్యామల ఫిర్యాదు పోలీసులు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

40 ఏళ్ల చెట్టుకు నిప్పు



శివ్వంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గూడూరు గ్రామంలో సుమారు 40 సంవత్సరాల భారీ చింత వృక్షానికి గురువారం రాత్రి నిప్పంటుకొని మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బందికి అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. కోతుల బాధకు గుర్తుతెలియని వ్యక్తులు చెట్టుకు నిప్పంటించి ఉంటారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పట్టు బట్టి..

గ్రూప్ 4లో ఉద్యోగాలు సాధించిన వారంతా ఒక్క రోజులో విజేతలు కాలేదు. వారి విజయం వెనక కఠోర శ్రమ ఉంది. ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగి అనుకున్నది సాధించారు. అదెలాగో వారి మాటల్లోనే..

మా నాన్న కల సాకారమయ్యింది



మా తల్లిదండ్రులకు ఇద్దరమ్మాయిలం. ఇటీవలే మా నాన్న చనిపోయారు. మా ఉన్నతి కోసం ఆయన చాలా కష్టపడ్డారు. మా అక్క కూడా తాజాగా వెలువడ్డ డీఎస్సీలో టీచర్ ఉద్యోగం సాధించింది. మా నాన్న బతికుండగా మమ్మల్ని మంచి స్థాయిలో చూడాలని కలలు కనేవారు. ఇద్దరం ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో ఆయన కల సాకారమైంది. ప్రస్తుతం నాకు వైద్య విధాన పరిషత్ జూనియర్ అసిస్టెంట్‌గా పోస్టింగ్ వచ్చింది. భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి వెళ్లేలా కష్టపడతాను.

-యాసరేణి సౌమ్య, లింగంపేట, తొగుట మండలం

అమ్మానాన్నల కష్టం చూసి..



మా అమ్మానాన్నలు పడుతున్న కష్టం చూసి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనుకున్నా. అందుకోసం పట్టుదలతో చదివాను. గత మార్చిలో కానిస్టేబుల్ ఉద్యోగం రావడంతో శిక్షణలో ఉన్నాను. గ్రూప్ 4 ఫలితాల్లో విజయం సాధించాను. సిద్దిపేట జిల్లాలో మున్సిపల్ వార్డు ఆఫీసర్‌గా పోస్టింగ్ వచ్చింది.శ

-లావుడ్యా సురేష్, పంతులుతండా, అక్కన్నపేట

అమ్మ ప్రోత్సాహంతోనే..



నా చిన్నతనంలోనే మా తండ్రి చనిపోయాడు. అమ్మనే అన్నీ తానై మా ముగ్గురిని కష్టపడి చదివించింది. దర్జీ పని చేస్తూ మమ్మల్ని బడికి పంపించింది. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలోనే చదివాను. ఉపాధ్యాయులు ఉద్యోగం సాధించేలా గైడ్ చేశారు. మైనార్టీ గురుకులంలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి సెలెక్ట్ అయ్యాను.

-దీకొండ అంజని, కొడకండ్ల, గజ్వేల్ మండలం

రోజూ 12 గంటలు చదివాను



రోజూ 12 గంటలు చదివాను. స్టడీ మెటీరియల్‌తో పాటు ఎక్కువగా దిన పత్రికలపైనే ఆధారపడ్డాను. అన్ని రకాల పోటీ పరీక్షలకు హాజరుకావడంతో గ్రూప్-4 లో విజయం సాధించడం కొంచం సులువైంది. జిల్లా స్థాయిలో 98 వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 4563 ర్యాంకు సాధించి జీహెచ్ఎంసీలో ఉద్యోగం సాధించాను.

-పుల్లన్నగారి మల్లికార్జున్, మార్డి, కల్హేర్ మండలం

అనుభవజ్ఞుల సలహాలు పాటించాను



పోటీ పరీక్షల కోసం అభ్యర్థులను సన్నద్ధం చేసే అనుభవజ్ఞుల సలహాలు తీసుకున్నాను. ఎలాంటి కోచింగ్ లేకుండా పుస్తకాలు, దినపత్రికల స్టడీ మెటీరియల్స్ గంటల తరబడి చదివి గ్రూప్-4 ఉద్యోగం పొందాను. జిల్లా స్థాయిలో 120 వ ర్యాంకు సాధించి రెవెన్యూ శాఖలో ఉద్యోగానికి ఎంపికయ్యాను.

- జంగం శివానంద్, ఫతేపూర్, కల్హేర్ మండలం

పట్టుదలతో చదివా...



తమది వ్యవసాయ ఆధారిత కుటుంబం. కుటుంబ పోషణకు తమ తల్లిదండ్రులు పడే కష్టాన్ని చూసి ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివాను. ఇటీవల వచ్చిన పోలీస్ కానిస్టేబుల్(సివిల్)ఫలితాలలో కానిస్టేబుల్‌గా ఎంపికై వరంగల్ పీటీసీలో శిక్షణ తీసుకున్నా. ఇంతలోనే గ్రూప్-4 ఫలితాలలో వార్డు ఆఫీసర్‌గా ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

-కొన్యాల స్రవంతి, దౌల్తాబాద్, హత్నూర మండలం

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా...



2020లో బీటెక్ పూర్తి చేశాను. అప్పటి నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా పట్టుదలతో చదివాను. గ్రామంలో ఉన్న గ్రంథాలయంలో గంటల కొద్ది ప్రిపేర్ అయ్యేవాడిని. మూడేళ్లుగా కష్టపడి చదివినందుకు తగిన ప్రతిఫలం దక్కింది. గ్రూప్ 4లో ఉత్తమ ప్రతిభ కనబర్చి మెదక్ వార్డు ఆఫీసర్ పోస్టుకు ఎంపికయ్యాను. భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి వెళ్లేలా కష్టపడతాను.

-మర్రి మహేష్, ఘణపూర్, తూప్రాన్ మండలం

తలిదండ్రుల ఆకాంక్ష మేరకు..



2017లో డిగ్రీ పూర్తి చేశాను. పోటీ పరీక్షల కోసం కష్టపడి చదివాను. రెండు ప్రభుత్వం ఉద్యోగాలు సాధించాను. గత ఏడాది ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా ఎంపికై శిక్షణలో ఉంటూ గ్రూప్-4 పరీక్ష రాశాను. ఈ ఫలితాల్లో హైదరాబాద్ సైనిక్ వెల్ఫేర్ స్కూల్‌లో ఉద్యోగం వచ్చింది. ఉన్నతమైన ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే నా తల్లిదండ్రుల ఆకాంక్షకు మేరకు.. పట్టుదల చదివి అతి కొద్ది కాలంలోనే రెండు ఉద్యోగాలు సాధించాను. ఏ ఉద్యోగంలో చేరుతానని ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఉద్యోగాలకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

-జగ్గ నవీన్‌గౌడ్, వెల్దుర్తి మండల కేంద్రం

మొదటిసారే సాధించా..



కొంతకాలంగా గ్రూప్-1 కోసం సన్నద్ధమవుతున్నాను. నిజాం కళాశాలలో గతేడాది పొలిటికల్ సైన్స్ పూర్తి చేశాను. అంతలోనే గ్రూప్-4 నోటిఫికేషన్ రావడంతో ఎలాగైనా ఉద్యోగం సాధించాలని మనుస్సులో గట్టిగా అనుకొని పట్టుదలతో ప్రిపేర్ అయ్యాను. మొదటి ప్రయత్నంలోనే జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. పక్కా ప్రణాళికతో గంటల కొద్ది చదివాను. మరింత ఉన్నతస్థాయి ఉద్యోగం సాధించేలా సన్నద్ధమవుతా.

-గూడెం శ్రీవాణి, జోగిపేట

సంగీత 'ప్రభాకరుడు'

మ్యూజిక్‌లో రాణిస్తున్న రాపర్తి యువకుడు

గాయకుడు, పాటల రచయిత, సంగీత దర్శకుడిగా బహుముఖ ప్రతిభ

ఎస్ఎం స్వరాలీ మ్యూజిక్ అకాడమీ స్థాపన

సంగీత ప్రపంచంలో తన 'దమ్ము' చూపిస్తూ 'ప్రభాకరు'డిగా ఉదయిస్తున్నాడు.. 'కన్నతల్లి నేలతల్లి ఒకటే తనకీ.. కష్టమైనా నష్టమైనా విడువడు ఎన్నటికీ' అంటూ అన్నదాతల సాధకబాధకాలకు పాట రూపమిచ్చి.. 'అడుగు నీ మనస్సాక్షినే అడుగు..' అంటూ టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వం ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి అవసరమంటూ రాజకీయ 'బాణీ'ని కూర్చి.. 'భగవంతునికి భక్తునికి నడుమ వీడరాని బలమైన బంధాన్ని వేసావుగా..' అని ఓ వ్యాపార ప్రకటనకు స్వరకల్పన అందించి వావ్ అనిపిస్తున్నాడు సంగారెడ్డి జిల్లాకు చెందిన ప్రభాకర్.

కల్హేర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మారుమూల ప్రాంతం నుంచి వచ్చి గాయకుడిగా, పాటల రచయితగా, సంగీత దర్శకుడిగా రాణిస్తున్నాడు దమ్ముగారి ప్రభాకర్. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండల పరిధిలోని రాపర్తికి చెందిన దమ్ముగారి రాములు, సావిత్రి దంపతుల కుమారుడు. మెదక్ జిల్లాలోని టేక్మాల్‌లో బంధువుల దగ్గర ఉంటూ ప్రభాకర్ పదో తరతగతి పూర్తి చేశాడు. స్కూల్ రోజుల్లో పాటలు పాడుతూ ఉండేవాడు. ఇంటర్, డిగ్రీ హైదరాబాద్‌లో చదివారు. అనంతరం ఎంబీఏ చదువుతూనే హైదరాబాద్ నిజాంపేట విజయాదిత్య సంగీత అకాడమీలో కర్ణాటక శాస్త్రీయ సంగీతంలో శిక్షణ పొందారు. చెన్నైలోని లండన్ పియానో అకాడమీలో చేరి మిడిల్ కీ బోర్డు అయిదో గ్రేడ్ కోర్సు పూర్తి చేశారు. వెస్ట్రన్, క్లాసికల్ మ్యూజిక్‌లోనూ శిక్షణ తీసుకున్నారు.

భగత్‌సింగ్‌నగర్ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్‌గా..

మ్యూజిక్ ఆల్బమ్, సీరియల్స్, ప్రైవేట్ సాంగ్స్ వ్యాపార ప్రకటనలకు సంగీతం అందిస్తూ, పలు మ్యూజికల్ ఈవెంట్స్ చేస్తూ ఎదిగిన ప్రభాకర్ భగత్‌సింగ్‌నగర్ సినిమాకు సంగీత దర్శకత్వం వహించారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆయన రైతులు పడే కష్టాలను వివరిస్తూ సంగీతం సమకూర్చి పాడిన కన్నతల్లీ నేలతల్లీ.. పాటను వింటే మనసును కదిలిస్తుంది. ఈ పాటను ప్రముఖ దర్శకుడు జాగర్లమూడి క్రిష్ విడుదల చేసి, రైతు విలువను పాట రూపంలో అద్భుతంగా పాడి సంగీతం సమకూర్చిన ప్రభాకర్‌ను అభినందించారు. ప్రభాకర్ స్వీయ దర్శకత్వంలో రూపొందించిన పాటల సీడీ 'తొలిసారి'ని ప్రముఖ నటుడు సంపూర్ణేష్ బాబు విడుదల చేశారు. ఈ పాటలు ప్రముఖ మాధ్యమాలైన వింక్, గానా, స్పాటిఫైలలో శ్రోతలకు అందుబాటులో ఉన్నాయి. ప్రభాకర్ చెన్నైలో పలు సంగీత కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చగా ప్రముఖ గాయని సుశీలమ్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఏపీ సీఎం చంద్రబాబుపై రూపొందించిన 'అడుగు నీ మనస్సాక్షినే అడుగు' పాటకు స్వయంగా విడుదల చేసిన చంద్రబాబు నాయుడు పాట విని ప్రభాకర్‌ను అభినందించారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లో ఎస్ఎం స్వరాలీ మ్యూజిక్ అకాడమీని నెలకొల్పారు. పలు బ్యాచ్‌లుగా ఉత్సాహవంతులైన యువతీయువకులకు, చిన్నారులకు మ్యూజిక్‌లో శిక్షణనిస్తూ నిత్యం సంగీతమే శ్వాసగా ముందుకుసాగుతున్నారు.


దమ్ముగారి ప్రభాకర్

సంగీత దర్శకుడిగా రాణించడమే లక్ష్యం : దమ్ముగారి ప్రభాకర్



చిన్ననాటి నుంచి పాటలన్నా, సంగీతమన్నా నాకు ఎంతో ఇష్టం. సప్త స్వరాలనే పంచ ప్రాణాలుగా భావిస్తాను. ప్రముఖ సంగీత దర్శకులు ఏఆర్ రహమాన్, దేవిశ్రీప్రసాద్‌లే ఆదర్శం. వారి స్ఫూర్తితో సంగీత దర్శకుడిగా రాణించడమే నా లక్ష్యం. గ్రామస్థాయి నుంచి సంగీత దర్శకుడిగా ఎదగడం ఆనందంగా ఉంది. నా ప్రయాణంలో గాయనీ గీతామాధురి, అంజనా సౌమ్య, పాడుతా తీయగా ఫేం ప్రవీణ్‌కుమార్ తోడ్పాటు మరవలేనిది. గ్రామీణ ప్రాంత కళాకారులకు చేదోడు వాదోడుగా నిలవడానికి ఎస్ఎం స్వరాలీ మ్యూజిక్ అకాడమీని నెలకొల్పాను.


గంగయ్యపల్లిలో నిరసన తెలుపుతున్న అన్నదాతలు

ధాన్యం తూకం ఆలస్యం..

రైతుల నిరసన

శివ్వంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రం ప్రారంభించి వారం రోజులు గడుస్తున్నా ధాన్యం బస్తాలను తూకం వేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం గంగయ్యపల్లి గ్రామంలో వారు నిరసన తెలిపారు. గ్రామంలో వారం రోజుల క్రితం ఐకేపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి చేతుల మీదుగా ఆర్భాటంగా కొనుగోలు కేంద్రం ప్రారంభించినా తూకం వేయడం లేదన్నారు. కేంద్రంలో గోనె సంచులు అందుబాటులో లేక, హమాలీలు రాకపోవడంతో ధాన్యం కొనుగోలు చేయడంలేదన్నారు. దీంతో రాత్రింభవళ్లు ధాన్యం బస్తాల వద్ద పడిగాపులు పడుతూ చలికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ఈ అవస్థలు పడలేక పలువురు రైతులు ధాన్యాన్ని తక్కువ ధరకే దళారులకు విక్రయిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. దీంతో తీవ్ర నష్టం వాటిల్లితుందన్నారు. వెంటనే అధికారులు స్పందించి ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు నాగరాజు, దాసరి పోచమ్మ, వెంకటేష్, తలారి నాగరాజు, యాదగిరి ఉన్నారు.

శాస్త్రీయ విద్యావిధానం కోసం పోరాడాలి

టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్

మెదక్ అర్బన్/సంగారెడ్డి అర్బన్ నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాలని, శాస్త్రీయ విద్యావిధానం కోసం పోరాడాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మెదక్, సంగారెడ్డి టీఎన్జీవో భవన్‌లలో వేర్వేరుగా నిర్వహించిన టీపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డబ్బు మూటలు పట్టుకొని ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేసేందుకు పెట్టుబడుదారులొస్తున్నారని, టీచర్లంతా అప్రమత్తంగా ఉండి హక్కుల కోసం పోరాడే అభ్యర్థులను ఎన్నుకోవాలన్నారు. కరీంనగర్ నియోజకవర్గ టీచర్స్ అభ్యర్థిగా రాష్ట్ర కమిటీ తనను ప్రకటించిందన్నారు. విధానాల అమలులో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ఒక్కటేనన్నారు. మార్చి తర్వాత మహాఉద్యమం చేపటనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అందరికి విద్య, వైద్యం అందించడం ప్రభుత్వాల బాధ్యత అన్నారు. ప్రతి సర్కారు బడిలో బోధనేతర సిబ్బందిని నియమించాలన్నారు. సర్వే విధుల్లోని టీచర్ల సమస్యలు పరిష్కరించి, ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్న సూచనలు పరిగణలోకి తీసుకోవాలని కోరారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ మాట్లాడుతూ ఉదయం పూట సర్వే నిర్వహించి మధ్యాహ్నం నుంచి బడులు నడిపించాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రాంచందర్ మాట్లాడుతూ టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్ ఉపాధ్యాయ ఎంఎల్‌సీ ఎన్నికల్లో పోటీకి అంగీకరించారని, ఆయనను గెలిపించాలని కోరారు. మెదక్ సమావేశంలో టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సంగయ్య, వెంకట్‌రాంరెడ్డి, దర్శిని ఎడిటర్ శశిధర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు కొంగటి యాదగిరి, సంగీత, మధుసూదన్‌రెడ్డి, రామకృష్ణ, జిల్లా నాయకులు గోపాల్, సురేందర్, పీర్‌సింగ్, నజీర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. సంగారెడ్డి సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, లక్ష్మయ్యయాదవ్, సోమశేఖర్, రాజరెడ్డి, నాగేశ్వర్‌రావు, సునీతాఖన్నా, సుభాష్‌బాబు, భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, నాజర్‌పటేల్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్

కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజలు



సంగారెడ్డి జిల్లా సదాశిపేట మండలంలోని నందికంది గ్రామంలోని శ్రీరామ లింగేశ్వర ఆలయంలో కార్తీకపౌర్ణమి పర్వదినం పుసర్కరించుకుని మంత్రి కొండాసురేఖ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

- సదాశివపేట, ఆంధ్రజ్యోతి

కార్తీక పౌర్ణమి సందర్భంగా అక్బర్‌పేట-భూంపల్లి మండలం పరిధి రామేశ్వరంపల్లి కూడవెల్లి గ్రామంలోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు.

- దుబ్బాక, ఆంధ్రజ్యోతి




అష్టాదశ శక్తిపీఠ దేవాలయం


కొలువుదీరిన ఉమా రామలింగేశ్వర స్వామి

మహిమాన్వితం.. అష్టాదశ శక్తిపీఠం

- రూ. 6 కోట్లతో నిర్మాణం
- ప్రథమ వార్షికోత్సవాలు షురూ

కొండపాక, నవంబరు 15 : కొండపాక ఆనంద నిలయం ఆవరణలో ఏర్పాటైన అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయం దినదిన ప్రవర్తమానంగా వెలుగొందుతోంది. గత సంవత్సరం నవంబరు 25న ప్రతిష్ఠాపన మహోత్సవాలు జరిగాయి. అమ్మవార్ల దర్శనం కోసం సిద్దిపేట జిల్లావాసులే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి తరలివస్తుంటారు. సుమారు రూ.6 కోట్ల వ్యయంతో వాస్తు కళా నైపుణ్యంతో ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందేలా ఆలయాన్ని నిర్మించారు. అష్టాదశ శక్తి పీఠాలలతో పాటు రామలింగేశ్వర స్వామి, పార్వతీదేవి, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి దేవాలయాలను కూడా నిర్మించారు. కోరారు.దేశంలోనే మొదటి అష్టాదశ శక్తి పీఠం ఆలయం ఇది అని, నిత్య పూజలతో ప్రత్యేక రోజుల్లో ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టు ప్రతినిధి అయిత నాగరాజు తెలిపారు.

మూడు రోజులపాటు ఉత్సవాలు

అష్టాదశ శక్తి పీఠ సహిత ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రథమ వార్షికోత్సవాలు శుక్రవారం ప్రారంభంకాగా, మూడు రోజుల పాటు జరుగుతాయి. మొదటి రోజు గణపతి పూజ, పుణ్యాహవచనము, అఖండ దీపారాధన కార్యాక్రమాలను వైభవంగా నిర్వహించారు. రెండవరోజు శనివారం దుర్గా చండీ హోమం, ఆదివారం రుద్రహోమం, పూర్ణాహుతి, ఉమామహేశ్వర కల్యాణం నిర్వహించనున్నారు.

కుక్కల దాడిలో 18 మేక పిల్లలు మృతి

కంగ్టి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో 18 మేక పిల్లలు మృతి చెందిన ఘటన శుక్రవారం కంగ్టి మండల పరిధిలోని దెగుల్‌వాడిలో జరిగింది. గ్రామానికి చెందిన ఉప్పరి రాంచందర్ రోజుమాదిరిగా శుక్రవారం మేక పిల్లలను ఇంటి ఆవరణలో ఉన్న రేకుల షెడ్డులో ఉంచాడు. మధ్యాహ్నం కుక్కలు షెడ్డు కిందిభాగంలో జాలికి కన్నం చేసి లోనికి వెళ్లి మేక పిల్లలపై దాడి చేసిం చంపాయి. దీంతో దాదాపు లక్షన్నర నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.


మృతి చెందిన మేక పిల్లల వద్ద బాధితుడు రాంచందర్

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

సంగారెడ్డి అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : డయల్‌యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని ఈ నెల 16 వ తేదీన నిర్వహించనున్నట్లు సంగారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఉపేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ప్రయాణికుల సమస్యలు, సలహాలు, సూచనల కోసం 9959226267 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

చెరువులు, కుంటల్లో చేప పిల్లలు విడుదల

పుల్‌కల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలంలోని వివిధ గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో శుక్రవారం మత్స్యశాఖ అధ్వర్యంలో లక్షా81 వేల చేప పిల్లలను విడుదల చేశారు. చౌటకూరు నాయిని చెరువులో 30 వేలు, కోమటి చెరువులో 35 వేలు, పోసానిపల్లిలోని పెద్ద చెరువులో 30 వేలు, సుల్తాన్‌పూర్ పెద్ద చెరువులో 30 వేలు, కోర్పోలులోని మల్కా చెరువులో 19 వేలు, పటేల్ చెరువులో 37 వేల చొప్పున చేప పిల్లలను విడుదల చేసినట్లు మత్స్య శాఖ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీశైలం, ఫిషర్ మెన్ కనకయ్య తెలిపారు.

చిట్కుల్ యువకుడికి జాతీయ అవార్డు

చిలప్‌చెడ్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని చిట్కుల్ గ్రామానికి చెందిన మిర్జా ఇంతియాజ్ అనే యువకుడికి జాతీయ సేవారత్న అవార్డు వరించింది. చిట్కుల్ గ్రామానికి చెందిన మిర్జా ఇంతియాజ్ చేసిన సేవలకు గాను జాతీయ స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఆధ్వర్యంలో అవార్డును ప్రధానం చేశారు. ఈ అవార్డును శుక్రవారం హైదరాబాద్‌లోని కళాభారతిలో జాతీయ స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎంజీవో సంస్థ చైర్మన్ ఆకుల రమేష్ అందజేశారు.

అండర్ డ్రైనేజీ అస్తవ్యస్తం

- జహీరాబాద్ పట్టణంలో అధ్వానంగా పారిశుధ్యం
- రోడ్లపైనే పారుతున్న మురుగునీరు.. పేరుకుపోతున్న చెత్త
- వేధిస్తున్న పారిశుధ్య సిబ్బంది కొరత
- అడ్డగోలుగా వెంచర్లకు అనుమతితో సమస్యల్లో కాలనీలు



జహీరాబాద్‌లోని నాగులకట్ట ప్రాంతంలో పూడుకుపోయిన డ్రైనేజీలు

జహీరాబాద్, నవంబరు 15: వెంచర్ల నిర్వాహకులకు సంబంధిత యంత్రాంగం కొమ్ము కాస్తుండడంతో అండర్‌డ్రైనేజీల వ్యవస్థ జహీరాబాద్ పట్టణంలోని అస్తవ్యస్తంగా తయారైంది. వెంచర్‌లో ప్లాట్ల సంఖ్య, నివసించే జనాభాకు అనుగుణంగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని వర్షపునీరు, మురుగునీరు వెళ్లేందుకు వెంచర్ల నిర్వాహకులు ఏర్పాటు చేసిన అండర్‌డ్రైనేజీ వ్యవస్థ, తదితర అంశాలను తుంగలో తొక్కి అడ్డగోలుగా అనుమతులివ్వడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆయా వెంచర్లలో ఏర్పాటు చేసిన అండర్ డ్రైనేజీలు(పైపులు) జామ్ కావడంతో ఆయా వెంచర్లలో ఉంటున్న ప్రజలతో పాటు అధికారులకూ తలనొప్పిగా తయారైంది. ప్రజల నుంచి వచ్చే ఒత్తిడిని తట్టుకోలేక అధికారులు అండర్‌డ్రైనేజీ ప్రాంతాల్లో ప్రత్యేకంగా కాలువలు నిర్మించడం, పైపులైన్లను వేయక తప్పడం లేదు.

సమస్యలను పరిష్కరిస్తున్నాం

సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఉన్నవారితోనే మా దృష్టికి వచ్చిన సమస్యలన్నింటిని పరిష్కరిస్తున్నాం. చెత్తసేకరణ, మురుగుకాలువల శుభ్రత తదితరాలపై ఎప్పటి కప్పుడు పర్యవేక్షణ చేపడుతున్నాం. పారిశుధ్య సమస్యలన్నింటిని పరిష్కరిస్తున్నాం. పట్టణంలో ఎక్కడైనా సమస్యలుంటే మా దృష్టికి తీసుకువస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

- సంధ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్

రికార్డులకు, వాస్తవానికి పొంతన ఏదీ?

వెంచర్ల నిర్వాహకులు తమ వెంచర్లను నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేశామని, అన్ని ఉన్నాయంటు అధికారులకు కాగితాలపై ప్లాన్‌లను చూయిస్తూ సంబంధిత అధికారులను నమ్మబలికి, మొక్కుబడిగా చిన్న పైపులైన్లను వేసి ప్లాట్లుగా మార్చి యథేచ్ఛగా విక్రయాలు చేపడుతున్నారు. వెంచర్ల నిర్వాహకులు తమ పలుకుబడితో అధికారులను ప్రలోభాలకు గురిచేస్తూ, లేదంటూ వారిపై ఒత్తిడితెస్తూ వెంచర్లను ఏర్పాటు చేయడం జహీరాబాద్‌లో సర్వసాధారణమైంది.

పారిశుధ్య సిబ్బంది కొరత

జహీరాబాద్ మున్సిపాలిటీలో 37 వార్డులుండగా సుమారు లక్ష పైచిలుకు జనాభా ఉంది. ఈ లెక్కన సుమారు 300 మంది పారిశుధ్య సిబ్బంది అవసరం ఉంది. ప్రస్తుతం కేవలం 176 మంది పారిశుధ్య సిబ్బంది మాత్రమే ఉన్నారు. ఇందులో 26మంది రెగ్యూలర్ సిబ్బంది ఉండగా 150 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. అయినప్పటికీ ఉన్న సిబ్బందితోనే అవసరాలకనుగుణంగా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులను చేపడుతున్నట్టు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. అలాగే నాగులకట్ట గడి తదితర ప్రాంతాల్లో మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసనతో డ్రైనేజీలు దోమలు, ఈగలకు నిలయాలుగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రోడ్లపై మురుగు పరుగు

పట్టణంలోని చెన్నారెడ్డినగర్, వసంతవిహార్, ఆదర్శనగర్, డ్రీమ్‌ఇండియా హౌజింగ్‌బోర్డు, తదితర కాలనీల్లో అండర్‌డ్రైనేజీ వ్యవస్థ ఉన్నప్పటికీ వెంచర్ ఏర్పాటు సమయంలో వెంచర్ల నిర్వాహకులు మురుగునీరు వెళ్లేందుకు చిన్న పైపులను ఏర్పాటు చేశారు. ఆ పైపుల్లో మురుగు నీరు, చెత్త చెదారం పేరుకుపోయి పైపులన్ని జామ్ అయ్యాయి. దీంతో పైపులైన్‌లు పగిలిపోయి రోడ్లపై యథేచ్ఛగా మురుగునీరు ప్రవహిస్తున్నాయి. ఉన్న ఓపెన్ డ్రైనేజీలకు తోడుగా అండర్‌డ్రైనేజీలు మురుగునీరు, చెత్త చెదారంతో నిండుకోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఎటు చూసినా ప్రధాన చౌరస్తాలతో పాటు అంతర్గత రోడ్ల పక్కన చెత్త, డ్రైనేజీలు మురుగునీటితో అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. మున్సిపాలిటీగా విస్తరించినప్పటికీ సిబ్బంది అందుకు అనుగుణంగ పారిశుధ్య సిబ్బంది లేకపోవడంతో ఉన్నవారితోనే సరి పెట్టుకోవాల్సి వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

చెన్నారెడ్డి నగర్‌కాలనీలోమురుగునీరు



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



సంగారెడ్డిలోని గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనకు హాజరైన పాఠకులు

సంగారెడ్డి అర్బన్/రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సంగారెడ్డిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో రెండో రోజు పుస్తక ప్రదర్శన నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, సంస్థ కార్యదర్శి వసుంధర సమక్షంలో వారోత్సవాలు నిర్వహించారు. గ్రంథాలయంలో అరుదైన, ప్రముఖులు వారి జీవిత చరిత్ర పుస్తకాలు, జ్ఞాన సంబంధితమైన కథలు, తమాషా కథల పుస్తకాలు, ప్రపంచ స్థాయి జోక్స్ బుక్స్, త్రిభాషా పదకోశాలు, తెలంగాణ భౌగోళిక సాహిత్య రచనాత్మక పుస్తకాలు ప్రదర్శనలో ఉంచారు. గ్రంథాలయ పాఠకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సహాయ గ్రంథ పాలకులు శ్రీనివాస్, సిబ్బంది వరలక్ష్మి, సావిత్రి, మూర్తి, నాగరాజు, మంజుల పాల్గొన్నారు.

రేగోడులో గ్రంథాలయం ప్రారంభం



అర్ ఇటిక్యాలలో ఏర్పాటు చేసిన లైబ్రరీని ప్రారంభిస్తున్న సీఐ రేణుక

రేగోడు నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థులు, యువకులు, విద్యావంతులు అర్ ఇటిక్యాల పాఠశాలలో స్వయంగా ఏర్పాటు చేసుకున్న లైబ్రరీని శుక్రవారం అల్లాదుర్గం సీఐ రేణుక, రేగోడు ఎస్‌ఐ పోచయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థులు గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. నిరుద్యోగులకు కాంపిటేషన్‌కి కావలసిన మెటీరియల్ లైబ్రరీలో అందుబాటులో ఉంచేందుకు తమవంతు సహాయం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో వటిపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మణ్, ఏఈవో విఠల్ రావు, తెలుగు ఉపాధ్యాయులు నరసింహ, ప్రధానోపాధ్యాయులడు వెంకటేశం, సోమేశ్వర్, పోలీస్ వీరన్న, రాజలింగం, ఈశ్వరప్ప, మల్లేశం, మండల యువనాయకులు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా సమగ్ర కుటుంబ సర్వే

- క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ



పుల్కల్:కోర్పోలులో సమగ్ర కుటుంబ సర్వే వివరాలను పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్



మెదక్ మండలం రాజ్‌పల్లిలో సమగ్ర సర్వే వివరాలపై ఆరా తీస్తున్న మెదక్ కలెక్టర్

పుల్‌కల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సామాజిక సర్వే సంగారెడ్డి జిల్లాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా, సజావుగా సాగుతున్నదని కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. మండల కేంద్రం చౌటకూర్‌తో పాటు కోర్పోలు గ్రామాలను శుక్రవారం ఆమె సందర్శించారు. ఇంటింటి సర్వే ప్రక్రియను కలెక్టర్ క్రాంతి వల్లూరు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్యూమరేటర్లు సమాచారం సేకరిస్తున్న తీరును, వివరాల నమోదు చేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కనీస సౌకర్యాల కల్పనపై ఆరా తీశారు. ధాన్యం కొనుగోలు, బిల్లుల చెల్లింపుల వివరాలతో కూడిన రిజిష్టర్లను తనిఖీ చేశారు. సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161వ జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై ఆరబెట్టిన వరి ధాన్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేకాధికారి బాలరాజు, తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మెదక్ జిల్లాలో..

మెదక్, కల్చరల్/ చేగుంట/వెల్దుర్తి/మనోహరాబాద్ నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మెదక్ మండలంలోని రాజ్‌పల్లి గ్రామంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సామాజిక సర్వే వివరాల నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా సమగ్ర వివరాల నమోదు విధానాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి తప్పులు దొర్లకుండా, సర్వే లక్ష్యాలు నెరవేర్చే బాధ్యత ఎన్యూమరేటర్లదేనన్నారు. ప్రజలు సరైన సమాచారాన్ని ఇచ్చి సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. మెదక్ మండలం కొంటూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సిబ్బందికి తగిన సూచనలు చేశారు. అనంతరం మెదక్ పట్టణంలోని చాముండేశ్వరి రైస్ మిల్లు ఆకస్మిక తనిఖీ చేశారు కలెక్టర్ వెంట వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. చేగుంట మండలం రెడ్డిపల్లిలో గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య పర్యవేక్షించి, సర్వే వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వేను వేగవంతం చేయాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. వెల్దుర్తి మండలంలోని ఉప్పులింగాపూర్, బస్వాపూర్ గ్రామాల్లో సమగ్రసర్వేను ఎంపీవో విఘ్నేశ్వర్ పర్యవేక్షించారు. మనోహరాబాద్ మండలంలోని లింగారెడ్డిపేట్ గ్రామానికి చెందిన లక్ష్మీ అనే ఎన్యూరేటర్ అందరికంటే ముందుగానే 156 కుటుంబాలకు సంబంధించిన వివరాలను నమోదు చేసి వంద శాతం సర్వే పూర్తి చేశారు. దీంతో మండల ప్రత్యేక అధికారి నర్సింలు ఆమెను సన్మానించారు.

ఎస్పీ దృష్టికి రైతుల సమస్యలు



కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

కొల్చారం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాన్ని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం కొల్చారం మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ లారీల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే ఉన్నతాధికారితో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్‌ఐ గౌస్, సిబ్బంది తో పాటు రైతులు పాల్గొన్నారు.

అల్లీపూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభం

శివ్వంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధాన్యంను దళారులకు అమ్మి మోసపోవద్దని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని పీఏసీఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం రైతులు తీసుకు వచ్చిన ధాన్యాన్ని తూకం వేశారు.

నీటి ఎద్దడిపై స్పందించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నిజాంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాగు నీటి సమస్య తీర్చేందుకు అధికారులు కదిలివచ్చారు. మండలంలోని నస్కల్ గ్రామంలో మైసమ్మ కాలనీలో నీటి సమస్యపై ఆగ్రహించిన మహిళలు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టగా ఆంధ్రజ్యోతి దినపత్రికలో గురువారం ప్రచురితమైన విషయం తెలిసిందే. వెంటనే స్పందించిన అధికారులు కాలనీలో ఎక్స్‌కవేటర్‌తో పైప్ లైన్ మరమ్మతులు చేపట్టారు. ఇక ముందు తాగు నీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీటిని సరఫరా చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. తమ సమస్యను వెలుగులోకి తెచ్చి పరిష్కారానికి కారణమైన ఆంధ్రజ్యోతి దినపత్రికకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఖేడ్‌లో లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్నపథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. శుక్రవారం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను అర్హులకు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి, మల్లన్న, ఖాసీం, అల్లాభకాష్, అర్జున్, బాబురావు, ఏశప్ప, సంజీవ్, తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారం దిశగా కృషి

జహీరాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశగ కృషిచేస్తానని మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వర రావు పేర్కొన్నారు. వారం రోజులుగా మున్సిపల్ ఎదుట మున్సిపల్ కార్మికులు పీఎఫ్, ఈఎస్‌ఐ డబ్బులు చెల్లించాలని కోరుతూ ధర్నా చేపట్టారు. ఈ విషయమై కమిషనర్ శుక్రవారం స్పందించి సమస్యలను పరిష్కరించే విధంగ కృషి చేస్తానని, పెండిగ్ వేతనాలు త్వరలో ఇస్తానని,ఈఎస్‌ఐ, పీఎఫ్‌డబ్బులు చెల్లిస్తానని చెప్పడంతో కార్మికులు ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మైపాల్, కార్మికులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లా చేనేత ఐక్య వేదిక అధ్యక్షుడిగా మహంకాళీ క్రిష్ణమూర్తి



పెద్దశంకరంపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా పెద్దశంకరంపేట గ్రామానికి చెందిన చేనేత సహకార సంఘంమాజీ చైర్మన్ మహంకాళి కృష్ణమూర్తిని, మెదక్ జిల్లా చేనేత ఐక్యవేదిక అధ్యక్షుడిగా రాష్ట్ర చేనేత ఐక్యవేదిక అధ్యక్షుడు రాపోలు వీర మోహన్ శుక్రవారం నియమించారు. ఈ సందర్భంగా మహంకాళి కృష్ణమూర్తి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మెదక్‌జిల్లా చైతన్య వేదిక అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు వీర మోహన్, పద్మశాలీ మెదక్ జిల్లా సంఘం అధ్యక్షులు జయరాములు, గుజ్జరి కనకరాజులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ పద్మశాలీ కులస్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి చైతన్య వేదిక ద్వారా తీసుకెళ్తానని అన్నారు.

వార్డు ప్రజల సమస్యల పరిష్కారానికి హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసిన కౌన్సిలర్

నర్సాపూర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలోని పదవ వార్డు కౌన్సిలర్ బుచ్చేస్ యాదవ్ తమ వార్డు పరిధిలో ప్రజల సమస్యలు తెలిపేందుకు వినూత్న రీతిలో ప్రత్యేకంగా హెల్ప్ డెస్కును ఏర్పాటు చేశారు. శుక్రవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోడరాజేందర్ చేతుల మీదుగా హెల్పు డెస్కును ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ బుచ్చేస్‌యాదవ్ మాట్లాడుతూ పదో వార్డులోని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడే తీర్చేందుకు కార్యాలయంలో హెల్పుడెస్కును ఏర్పాటు చే స్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రాంరెడ్డి, చంద్రశేఖర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

గాజుల్‌పాడ్ మీదుగా కంగ్టికి బస్సు నడపాలి

- డీఎంను కోరిన ప్రయాణికులు

నారాయణఖేడ్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కంగ్టి మండలం గాజుల్‌పాడ్ మీదుగా కంగ్టికి బస్సు నడపాలని గాజుల్‌పాడ్ గ్రామానికి చెందిన ప్రయాణికులు మాధవరావు, మస్తాన్‌లు కోరారు. శుక్రవారం నిర్వహించిన డయల్‌యువర్ డీఎం కార్యక్రమం ద్వారా వారు తమ గ్రామం మీదుగా గతంలో మండల కేంద్రమైన కంగ్టికి బస్సు ఉండేదని, ప్రస్తుతం బస్సు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ వద్ద ఎక్స్‌ప్రెస్ రిక్వెస్ట్ స్టాప్‌ను ఏర్పాటు చేయాలని అక్కడి ప్రయాణికులు కోరారు. ఖేడ్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, సిర్గాపూర్, తడ్కల్‌మీదుగా కామారెడ్డి జిల్లా బాన్సువాడకు బస్సు నడపాలని కోరారు. కంగ్టికి చెందిన శ్రీనివాస్, కంగ్టిలో నైట్ హాల్ట్ బస్సును ఉంచాలని కోరారు. ప్రయాణికుల సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని డీఎం తెలిపారు.

మాధారం నుంచి ఔటర్ సర్వీసు రహదారి వరకు మరమ్మతులు

జిన్నారం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మాదారం నుంచి ఔటర్ రింగ్ రోడ్డు సర్వీసు రహదారి వరకు రహదారికి ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. ఈ రోడ్డుపై ఇటీవల కాలంలో భారీ గుంతలమయంగా మారి ప్రమాదాలు జరుగుతుండగా.. స్థానికుల ఫిర్యాదుతో శుక్రవారం ఆర్‌అండ్‌బీ అధికారులు పనులు ప్రారంభించారు.

నేటి నుంచి మండలపూజ

తూప్రాన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం నుంచి మండల పూజ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, గురుస్వాములు చిన్నలింగ్ శ్రీనివాస్‌గౌడ్, బజారు రూపేశ్‌లు శుక్రవారం తెలిపారు.

గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



గ్రామ సభలో మాట్లాడుతున్న పిరామల్ ఫౌండేషన్ సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ ఫర్వేజ్‌ఖాన్

కోహీర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని పిరామల్ ఫౌండేషన్ సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ ఫర్వేజ్ ఖాన్ అన్నారు. శుక్రవారం నవంబరు 15వ తేదీ జనజాతీయ గౌరవ దివస్‌ను పురస్కరించుకొని మండలంలోని గొటిగర్‌పల్లి గ్రామంలో పిరామల్ ఫౌండేషన్ సౌజన్యంతో మండల పంచాయతీ అధికారి వినోద్‌కుమార్, ఎంఈవో జాకీర్ హుస్సేన్‌లు ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఫర్వేజ్‌ఖాన్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలోని అడవులను, అడవి సంపదలను గిరిజనులే కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. నవంబర్ 15వ తేదీని జనజాతీయ గౌరవ్ దివస్‌గా కేంద్ర ప్రభుత్వం గతేడాది ప్రకటించిదని అందువల్లే ఈ ప్రత్యేక గ్రామసభను నిర్వహిస్తున్నట్టు మండల పంచాయతీ అధికారి వినోద్‌కుమార్, ఎంఈవో జాకీర్‌హుస్సేన్‌లు తెలిపారు. గిరిజనుల అభివృద్ధికి గిరిజనులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అటవీ సంపదను కాపాడేందుకు ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే రైతు వేదిక ఆవరణంలో మొక్కలు నాటారు. నాయకులు రాచయ్య, రాజునాయక్, పిరామల్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కార్తీక పౌర్ణమి



జహీరాబాద్ శివాలయం ఆవరణలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న ఏడుపాయల ఆలయ పరిసరాలు, (ఇన్‌సెట్‌లో) మూలవిరాట్ ప్రత్యేక అలంకరణ

న్యూస్ నెట్‌వర్క్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని శైవక్షేత్రాలు శుక్రవారం దీపకాంతుల్లో కొత్త శోభను సంతరించుకున్నాయి. ఉదయం నుంచే ఆలయాల్లో భక్తులు కార్తీక దీపాలను వెలిగించడంతో ఆధ్యాత్మిక సందడి ఉట్టిపడింది.

సంగారెడ్డి జిల్లాలో..

సంగారెడ్డి మండలం తాళ్లపల్లిలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో జిల్లా న్యాయాధికారి భవానీచంద్రా కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. జిన్నారం మండలం ఊట్ల అయ్యప్పస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఝరాసంగం మండలం శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతురావు ప్రత్యేక పూజలు చేశారు. జహీరాబాద్ లోని సిద్దేశ్వరాలయంలో తులసీకల్యాణం నిర్వహించారు. నాగులకట్టవద్ద గల రుక్మిణీపాండురంగ ఆలయంలో రథోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కోహీర్ మండలంలోని బడంపేట శ్రీ రాచన్న స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, దీపారాధన నిర్వహించారు. ఉమ్మడి పుల్కల్ మండలంలో, చౌటకూర్‌లో వెలసిన అత్యంత పురాతనమైన శ్రీ అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వరాలయంలో, నారాయణఖేడ్‌లో శివపార్వతుల కల్యాణోత్సవం, రాత్రి దీపోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు.

మెదక్ జిల్లాలో..

మెదక్ జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవీధి, కుమ్మరిగడ్డ, పేరూర్ ఆలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయాల్లో కార్తీక దీపాలు వెలుగించి మొక్కులు చెల్లించుకున్నారు. మెదక్‌లోని శ్రీకోదండ రామాలయం అయ్యప్ప దేవాలయంలో కార్తీక దీపోవత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గా క్షేత్రంలోని మంజీర పాయల్లో మహిళలు కార్తీక దీపాలు వదిలారు. అమ్మవారికి గర్భగుడి నుండి గోకుల్ షెడ్ వరకు వల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అదనపు కలెకర్ నగేశ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తూప్రాన్ పట్టణంలోని గీతామందిరంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరుపుకున్నారు. ఇస్లాంపూర్ శివారులోని రామప్పగుట్టపై వెలసిన శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నర్సాపూర్ మండలం రుస్తుంపేట ఆత్మనంద ఆశ్రమంలో పీఠాధిపతి వెంకటస్వామి నేతృత్వంలో లక్షదీపారాధన నిర్వహించారు. శివ్వంపేట మండలంలోని బగలాముఖి ఆలయ ప్రాంగణంలో భగలాముఖి ట్రస్టు మెంబర్ హైకోర్టు న్యాయవాది శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా మాసాయిపేట, వెల్దుర్తి , పెద్దశంకరంపేట, చిన్నశంకరంపేట, కౌడిపల్లి, చేగుంట, చిలప్‌చెడ్ తదితర మండలాల్లో శైవక్షేత్రాలు భక్తజనసంద్రమయ్యాయి.



మెదక్‌లోని కోదండ రామాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వైవిధ్యం నవాయతన శ్రీరామ యాగ మహోత్సవం



ఫసల్‌వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమంలో నిర్వహించిన నవాయతన శ్రీరామ యాగ మహోత్సవ కార్యక్రమం

సంగారెడ్డి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమంలో శుక్రవారం నిర్వహించిన నవాయతన శ్రీరామ యాగ మహోత్సవం ఆశ్రమ వ్యవస్థాపకుడు మహేశ్వర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో వైవిధ్యంగా నిర్వహించారు. ఈ యాగంలో భాగంగా గణపతిగి పూజ, గురుపూజ, జ్వాల తోరణం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరన గావించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ సభ్యులు ప్రశాంత్‌కుమార్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానవ జన్మకు మోక్షం



మేగ్యాతండాలో మాట్లాడుతున్న సంగ్రాం మహరాజ్

నాగల్‌గిద్ద, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):ఆధ్యాత్మిక చింతనతోనే మానవ జన్మకు మోక్షం లభిస్తుందని అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్ అన్నారు. గురువారం రాత్రి మండల పరిధిలోని మేగ్యాతండాలో దేవిదాస్ మహారాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక మాస లక్ష దీపోత్సవ కార్యక్రమంలో సంగ్రాం మహారాజ్ హాజరై భక్తులకు ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. మారుమూల ప్రాంతంలో ఏటా లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. అనంతరం భక్తులు లక్ష దీపోత్సవాలను వెలిగించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్, తదితరులు హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.